
సాక్షి
జనగామ

గురువారం | 25 | మే | 2023



పేదలకు అండగా స్టడీ సర్కిల్

అధిక ఫీజులు చెల్లించి శిక్షణ పొందే స్తోమత లేని పేదలకు ఎస్సీ స్టడీ సర్కిల్ అండగా నిలుస్తోంది. పేద అభ్యర్థులకు ఉద్యోగాలు అందించే విద్యాలయంగా వెలుగొందుతోంది. - 8లో▸



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ క్రాస్ వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తల్లీ బిడ్డలు మృతి చెందారు. తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/29^0$

వాతావరణం

ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన 'కంటి వెలుగు'



జనగామ రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలు పట్టణ పరిధి 30 వార్డుల్లో ముగిశాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శరత్‌కుమార్, సామాజిక వైద్యాధికారి రహెమాన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మొత్తం 20,147 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దగ్గరి చూపు సమస్య ఉన్న 4,007 మందికి అద్దాలు ఇచ్చామని చెప్పారు. ఆర్డర్ చేసిన 3,163 అద్దాల్లో 2,743 మందికి అందజేశామని, మిగిలినవి రాగానే పంపిణీ చేస్తామని చెప్పారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలి



జనగామ రూరల్: కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ఫోరం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు నాయకులు దివ్యాంగుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డి ఇచ్చిన లేఖతో బుధవారం కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ప్రధాన కార్యదర్శి బండ దేవయ్య, పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఇబ్రహీం, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సవాల పేరుతో మోసం



జనగామ రూరల్: రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ఇంత వరకు పంట నష్టపరిహారం అందించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, అలాగే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ బాధ్యులను శిక్షించి నష్టపోయిన ప్రతి నిరుద్యోగికి రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ పాపారావు, నాయకులు ఉడుగుల రమేష్, సొడ రమేష్, శివరాజ్, రాజశేఖర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

జనగామ రూరల్: ఉమ్మడి వరంగల్ ఐటీడీఏ పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తూ.. పోటీ పరీక్షల కోసం గ్రూప్–2,3,4 శిక్షణ ఇస్తామని, ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాలకు దారఖాస్తు చేసుకున్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 27 వరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0870-3500644 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జనగామ రూరల్: జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి ఇచ్చిన లేఖను కలెక్టర్ శివలింగయ్యకు బుధవారం జర్నలిస్టులు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. ఇందుకు సంబంధించి విధివిధానాలు, ఇతర జిల్లాల్లో అమలు తీరును తెలియజేశారు.

ముందస్తు వరినాట్లు..

ఈ ఏడాది మార్పులతో వ్యవసాయ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- జూలై 15 నాటికి వరి నాట్లు ముగిసేలా కసరత్తు
- 3.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనా..
- 84,741 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- వానాకాలం ప్రణాళిక ఖరారు..!



వరినారు తీస్తున్న కూలీలు(ఫైల్)

జనగామ రూరల్: జిల్లాలో 2023–24 వానాకాలం పంటల ప్రణాళిక ఖరారైంది. నేల స్వభావాన్ని బట్టి ఏపంట ఎంత విస్తీర్ణంలో వేయాలనే దానిపై పంటల సాగుకు అవసరం అయ్యే విత్తనాలు, ఎరువుల అంచనాలతో వ్యవసాయ శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జూన్‌లో వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేశారు. వివిధ రకాల పంటలు కలిపి 3.76 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్‌లో వడగళ్ల వానలు కురిసి పెద్ద మొత్తంలో వరి పంటకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో ముందస్తు నాట్లు వేసి పంట కోతలు చేపట్టేలా అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ సీజన్ నుంచే కసరత్తు మొదలు పెట్టారు.

విత్తన రకాలపై కసరత్తు

జిల్లాల్లో వానాకాలం సీజన్ పంటల సాగును ముందస్తుగా ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. నేల స్వభావం, భూగర్భ జలాల లభ్యత, చలి తీవ్రతను దృష్టిపెట్టుకుని ఆయా పరిస్థితులకు అనువుగా ఉండే నూతన విత్తన వంగడాలను అందుబాటులోకి తెచ్చే పనిలో ఉన్నారు. ఇందుకు రాష్ట్ర స్థాయిలో కసరత్తు పూర్తి చేసి ఈనెల చివరణ నిర్ణయం తీసుకోనున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్‌లో నారు పోయడం వల్ల చలి తీవ్రంగా ఉండి జింక్ లోపం పెరిగి నారు ఎదగదని రైతులు వెల్లడించిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని అనువుగా ఉండే విత్తనాలు తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది.

జిల్లాలో 2023-24 సంవత్సరం వానాకాలం పంటల సాగు అంచనా వివరాలు(ఎకరాల్లో)

మొత్తం పంటలు	: 3,76,000
వరి	: 1,90,000
పత్తి	: 1,70,000
కంది	: 11,000
మొక్కజొన్న	: 4,000
పెసర	: 1,100
వేరుశనగ	: 250
మినుములు	: 150
నువ్వులు	: 125

జూన్ 15 నుంచి వరి నాట్లు

యాసంగి సీజన్‌లో వడగళ్ల వానలతో పంటలకు కలిగే నష్టాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఇసారి సీజన్లను ముందే మొదలెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీ చేయగా.. గ్రామాల్లో సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా ఏటా వానాకాలం సీజన్ వరి నాట్లు జూలైలో ప్రారంభించి సెప్టెంబర్ వరకు కొనసాగుతాయి. పంట పొట్టకు వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో వడగళ్లు కురిసి తీవ్ర నష్టం జరుగుతోంది. దీనిని అధికమించేందుకు ముందస్తు నాట్లు వేసేలా ప్లాన్ చేస్తున్నారు. జూన్ 15 లోగా నారు పోసి.. జూలై 15 లోపు నాట్లు వేయడం.. అలాగే యాసంగి పంటలకు నవంబర్ 15లోగా నారు పోసి.. డిసెంబర్ 15 నాటికి నాట్లు పూర్తి చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

అవసరమయ్యే ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

డీఏపీ	18,831
యూరియా	43,312
ఎంఓపీ	7,533
కాంప్లెక్స్	15,065

ఎరువులకు ప్రతిపాదనలు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాగయ్యే పంటలకు సంబంధించి 84,741 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఎరువులు సీజన్ ప్రారంభంలోనే జిల్లాకు చెరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. భాస్వరం నిల్వలు అధికంగా ఉన్న నేలల్లో వినియోగాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు భూసార పరీక్షలు చేయించి దానిప్రకారం ఎరువుల మోతాదు సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచిస్తోంది.

పంట సాగు సీజన్‌లో మార్పు..



యాసంగి పంటల కోత సమయంలో వడగళ్లు, అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారు. దీనిని నివారించడానికి పంట సాగు సీజన్‌ను ముందుకు జరపాలని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వానాకాలం జూన్ 15లోపు, యాసంగిలో నవంబర్ 15 లోపు నార్లు పూర్తి చేయాలి. నేల స్వభావాన్ని భట్టి విత్తనాలు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై సీజన్ ప్రారంభంలోగా స్పష్టత రానుంది.

– వినోద్‌కుమార్, డీఏఓ

దశాబ్ది ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ సీతారాం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని, ఈ సందర్భంగా చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. ఈ మేరకు జిల్లా ప్రగతిపై అధికారులు వివరాలతో నివేదికలు అందజేయాలని చెప్పారు. ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, ప్రణాళిక అధికారి ఇస్మాయిల్, విద్యుత్ ఎస్సీ వేణు మాధవ్, డీఏఓ, డీఎస్‌ఓ రోజారాణి పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



విజేతలతో ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ

జనగామ రూరల్: క్రీడలతో యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ చాంపియన్ షిప్ క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ సీతారాం హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న 75 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఆర్డీఓ మధుమోహన్, పాలకుర్తి జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కబడ్డీ పురుషుల విభాగం ప్రథమ పాలకుర్తి, ద్వితీయ రఘునాథపల్లి, మహిళల విభాగం పాలకుర్తి ప్రథమ, నర్మెట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖోఖో మెన్స్ ప్రథమ పాలకుర్తి, ద్వితీయ బచ్చన్నపేట, ఉమెన్స్ ప్రథమ పాలకుర్తి, ద్వితీయ స్టేషన్ ఘన్‌పూర్, వాలీబాల్ మెన్స్ ప్రథమ జఫర్‌గఢ్, ద్వితీయ నర్మెట, ఉమెన్స్ ప్రథమ పాలకుర్తి, ద్వితీయ నర్మెట, బ్యాడ్మింటన్ మెన్స్ సింగిల్ ప్రథమ బి.హరీశ్, ద్వితీయ వై.మహేశ్, డబుల్స్ ప్రథమ బి.హరీశ్, కమల్‌హసన్, ద్వితీయ వై.మహేశ్, సాకేత్, ఉమెన్స్ సింగిల్ ప్రథమ బి.సంగీత, ద్వితీయ స్థానంలో జి.నిహారిక విజయం సాధించారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కమలాకర్

జనగామ రూరల్ : రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి.. దిగుమతి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌తో కలిసి కలెక్టర్లు, సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా పంట విస్తీర్ణం పెరిగి ధాన్యం ఎక్కువగా పండుతోందని, చివరి గింజ వరకూ సర్కారు కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత ఏడాది 4.5 లక్షల మంది రైతుల నుంచి 28 లక్షల 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. ఈ ఏడాది మే 23 వరకు 6.4 లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల 50వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. కొనుగోళ్లలో వేగం పెంచడంతోపాటు దిగుమతి సమస్య తలెత్తకుండా ఇంటర్మీడియట్ గోదాంలు గుర్తించి ధాన్యాన్ని భద్రపరచాలన్నారు. హమాలీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి లోడింగ్ సమస్య రాకుండా చూడాలని, అవసరమైతే లారీలను పెంచుకోవాలని చెప్పారు. అలాట్ చేసిన రైస్ మిల్లులు తప్పనిసరిగా ధాన్యం దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా లక్షా ఐదువేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 40 వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ రోజారాణి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, అధికారులు కిరణ్ కుమార్, నాగేశ్వరశర్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రణాళిక, నిలకడ ముఖ్యం

ఆన్‌లైన్ కోచింగ్ ఎంతగానో దోహదపడింది

- సక్సెస్‌లో ఆప్షనల్ ఎంపిక కూడా కీలకమే
- తల్లిదండ్రుల ప్రోత్సాహం.. స్నేహితుల సహకారం గొప్పది
- 'సాక్షి'తో సివిల్స్ 40వ ర్యాంకర్ శాఖమూరి శ్రీసాయి అశ్రిత్
- సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు కృషి చేస్తానని వెల్లడి



మాట్లాడుతున్న శాఖమూరి శ్రీసాయి అశ్రిత్

హన్మకొండ: 'ఫలితం గురించి ఆలోచించలేదు. ఐఏఎస్ అనే లక్ష్యాన్ని ఎంచుకున్నా. చదువుకుంటూ వెళ్లా. ప్రణాళికాబద్ధంగా.. నిలకడగా చదివితే సులువుగా విజయం సాధించవచ్చు.' అని అంటున్నారు సివిల్స్‌లో ఆలిండియా 40వ ర్యాంకు సాధించిన శ్రీసాయి అశ్రిత్. హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీకి చెందిన శాఖమూరి అమరలింగేశ్వర్‌రావు (అమర్), పద్మజ దంపతుల కుమారుడైన శ్రీసాయి అశ్రిత్ తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించారు. బుధవారం నగరానికి చేరుకున్న ఆయనను 'సాక్షి' పలకరించగా విద్యాభ్యాసం.. సివిల్స్ చదవాలన్న కోరిక ఎప్పుడు కలిగింది.. ఎలా ప్రిపేర్ అయ్యారు.. తదుపరి లక్ష్యాలు ఏమిటీ అన్న అంశాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నా చిన్నప్పటినుంచి తల్లిదండ్రులు సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. వాటిని చూసి పేదలకు, ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఏం చేయాలనే ఆలోచన వచ్చింది. తల్లిదండ్రులతో ఇదే అభిప్రాయాన్ని పంచుకున్నా. ఐఏఎస్ అధికారి అయితే ప్రజా సేవ చేసేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. అప్పటి నుంచి ఐఏఎస్ కావాలనే ఆకాంక్ష, కుతూహలం పెరిగింది. మా అమ్మానాన్న కూడా ప్రోత్సహించారు. బీటెక్ చదువుతూనే చాలా మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ వైపు వెళ్తారు. నేను ప్లేస్‌మెంట్ ఆలోచన రానీయలేదు. ఫైనలియర్ చదువుతుండగానే సివిల్స్‌వైపు దృష్టి పెట్టా. 2021 మే నుంచి ప్రిలిమ్స్‌కు సన్నద్ధమయ్యా. 2022లో ప్రిలిమ్స్‌కు హాజరై మెయిన్స్‌కు అర్హత సాధించా. అప్పటినుంచి మెయిన్స్‌కు సిద్ధమై మెరిట్ సాధించి ఇంటర్వ్యూకు వెళ్లా. ఇక్కడ అన్నీ కలిసి రావడంతో 40వ ర్యాంకు సాధించా. ఈ ర్యాంకుతో ఐఏఎస్ అవకాశం వస్తుంది. నా లక్ష్యం నెరవేరుతుంది.

ప్రిలిమ్స్ ఇంటినుంచే.. మెయిన్స్‌కు ఆన్‌లైన్ కోచింగ్

ప్రిలిమ్స్‌కు హనుమకొండలోని ఇంటి వద్ద ఉంటూ ప్రిపేర్ అయ్యా. మెయిన్స్‌కు ఢిల్లీలో కోచింగ్ వెళ్లాలన్న ఆలోచన ఉండేది. కోవిడ్ రెండో దశ కారణంగా వెళ్లలేకపోయా. హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఢిల్లీలోని వాజీరాం ఐఏఎస్ అకాడమీ నుంచి ఆన్‌లైన్ కోచింగ్ పొందా. నేరుగా కోచింగ్‌కు వెళ్తే గ్రూపుగా తరగతులకు వెళ్లాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ కోచింగ్ ద్వారానైతే ఒక్కరే, ఎలాంటి భంగం కలగకుండా తరగతులు వినే అవకాశముంటుంది. నాకు ఆన్‌లైన్ తరగతులు ఎంతగానో దోహదపడ్డాయి. సివిల్స్ సక్సెస్‌లో ఆప్షనల్ ఎంపిక కూడా కీలకమే. నేను ఆంత్రోపాలజీ ఆప్షన్ తీసుకున్నా.

క్రమపద్ధతిలో చదివితేనే విజయం

సివిల్స్ అనేది కష్టమని అనుకుంటాం. కానీ క్రమపద్ధతిలో, నిలకడగా చదివితే సులువుగా విజయం సాధించవచ్చు. నేను రోజూ 6 నుంచి 8 గంటలు చదివే వాడిని. ఒక రోజు చదివి, మరో రోజు కాలక్షేపం చేస్తూ నిలకడ లేకుండా వ్యవహరిస్తే సివిల్స్‌లో ర్యాంకు సాధించలేం. రోజూ సమయపాలన పాటిస్తూ నిలకడగా చదవాలి. పరీక్షలకు రెండు నెలల ముందు.. రోజుకు 12 నుంచి 14 గంటలు చదివా. మొదటి ప్రయత్నంలోనే సఫలీకృతం అవుతానని అనుకోలేదు. పట్టుదలతో చదివా. ఫలితం దక్కింది. సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిత్యం చదువుతూనే ఉండాలి. ముందుగా వారిపై వారికి సాధిస్తాననే నమ్మకం పెరగాలి.

అందరి సలహాలు తీసుకున్నా..

చదివే సమయంలోనూ స్నేహితులతో మాట్లాడే వాడిని. కొంత రిలాక్స్‌గా ఉండేది. వారు కూడా కొన్ని సలహాలు ఇచ్చేవారు. స్నేహితులు అందించిన సహకారం చాలా గొప్పది. సివిల్స్ ప్రిపేర్ అయిన, అవుతున్న వారి సలహాలు కూడా తీసుకున్నా. రిజల్ట్ గురించి ఆలోచించకుండా లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు పోతే విజయం సాధిస్తాం. నేను రిజల్ట్ గురించి పెద్దగా ఆలోచించేవాడిని కాదు. చదువుకుంటూ వెళ్లా.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరితే ఆర్థిక అసమానతలు దూరం

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరాలి. దీంతోపాటు, విద్య, వైద్యం ప్రజలకు చేరువైతే సామాజిక, ఆర్థిక అసమానతలు తొలిగే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో నేను ఈ దిశగా కృషి చేస్తా.

శ్రీసాయి అశ్రిత్‌ను ఓపెన్‌టాప్ వాహనంపై ఊరేగింపుగా తీసుకెళ్తున్న బంధుమిత్రులు



శ్రీసాయి అశ్రిత్‌కు ఘనస్వాగతం

నగరానికి చేరుకున్న సివిల్స్ ర్యాంకర్ శ్రీసాయి అశ్రిత్‌కు ఘన స్వాగతం లభించింది. బుధవారం హైదరాబాద్ నుంచి హనుమకొండకు చేరుకోగా తెలంగాణ అమరవీరుల స్తూపం కూడలి నుంచి అడ్వొకేట్స్ కాలనీలోని తన స్వగృహం వరకు ఓపెన్‌టాప్ వాహనంపై బంధుమిత్రులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడుగునా బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరిపారు. అశ్రిత్‌తోపాటు తల్లిదండ్రులు శాఖమూరి అమరలింగేశ్వర్‌రావు (అమర్), పద్మజలను గజమాలతో సత్కరించారు.

శ్రీసాయి అశ్రిత్‌కు సీపీ సత్కారం



శ్రీసాయి అశ్రిత్‌ను అభినందిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : శ్రీసాయి అశ్రిత్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశ్రిత్‌కి సీపీ శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అనంతరం పరీక్షలకు ప్రిపేర్ అయిన విధానాన్ని సీపీ అడిగి తెలుసుకున్నారు. చిన్న వయస్సులోనే మొదటి ప్రయత్నంలో సివిల్స్ ఉద్యోగానికి ఎంపికైన సాయి అశ్రిత్‌ను అభినందిస్తూ భవిష్యత్‌లో నిరుపేదలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి పాటు పడేలా విధి నిర్వహణలో ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన జయసింహారెడ్డి, పత్తిపాక సాయికిరణ్, కొట్టె రుత్విక్ సాయి, మంద అపూర్వ, కొయ్యడ ప్రవీణ్‌కుమార్‌లకు సీపీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, శ్రీ సాయి అశ్రిత్ తండ్రి అమర్ పాల్గొన్నారు.

పురపాలికలో అక్రమాలు..!

- పూర్తయిన మున్సిపల్ ఆడిట్ ప్రక్రియ?
- తుది నివేదిక తర్వాత వివరాల వెల్లడి
- ఆకాశ రామన్న కొరియర్‌పై నాటి అధికారుల సంజాయిషీ..
- కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషనర్, ఇతర అధికారులు

పురపాలిక ఆడిట్ పూర్తయినట్లు సమాచారం. 2019–20–21–22 మూడేళ్ల ఆడిట్ పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు నిధులు ఖర్చు చేయడమే తప్ప.. ఆడిట్ చేయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఎంబీ రికార్డుల తారుమారు.. డబుల్ బిల్లుల చెల్లింపు.. నాసిరకం పనులు ఇలా అనేక అవకతవకలపై 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలతో ఆడిట్ టేబుల్‌పైకి ఎక్కింది. సుమారు ఏడు నెలల పాటు శ్రమించి ఆడిట్ పూర్తి చేయగా.. త్వరలోనే ఉన్నతాధికారులకు సమగ్ర రిపోర్టు అందించనున్నారు. – జనగామ

జనగామ మున్సిపల్ అవినీతి బట్టబయలు కాబోతున్నదా.. అంటే నిజమనే సమాధానం వినిపిస్తున్నది. నిధులను నీళ్లలా ఖర్చు చేసి.. లెక్కా పత్రాలు ఎక్కడాని ప్రశ్నిస్తే నీళ్లు నమిలే పరిస్థితి. ప్రజాధనాన్ని అప్పనంగా దోచేసిన అధికారుల జేబుల నుంచి తిరిగి వసూలు చేసేందుకు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న మూడేళ్ల మున్సిపల్ ఆడిట్‌ను గత ఏడాది అక్టోబర్‌లో మొదలు పెట్టారు. ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, పట్టణ ప్రగతి తదితర నిధుల ఖర్చు, చెల్లింపులకు సంబంధించిన వివరాలను ఆడిట్ అధికారులు తీసుకున్నారు. ఇందులో కొన్ని ఎంబీ రికార్డులు మాయం కావడంతో పాటు మరికొన్ని బిల్లులపై నాటి కమిషనర్లు, డీఈల సంతకాలు లేకుండా ఉన్నట్లు ఆడిట్ అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. 2019 నుంచి 2022 వరకు సుమారు రూ.45 కోట్ల నుంచి రూ.52 కోట్లు అభివృద్ధి పనులు, వేతనాల చెల్లింపులు, ఇతరాలకు ఖర్చు చేసి ఉండవచ్చు. ఇందుకు సంబంధించి ఏటా ఆడిట్ చేసి, ఖర్చు, మిగులుబాటు ఎంత అనేది కౌన్సిల్ ముందుంచాలి. ఇక్కడ ఆడిట్‌ను అటకెక్కించి అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పిందే వేదంగా నడిపించారు. ఆడిట్ లేకుండా బిల్లులు, చెక్కులు పాస్ చేసేది లేదని ప్రస్తుతం ఉన్న అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ తేల్చి చెప్పడంతో.. ఈ బాగోతం బయటకు వచ్చింది. దీంతో ప్రస్తుత కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆడిట్ నిర్వహణకు ఆదేశించారు.

పెద్ద మొత్తంలో అక్రమాలు!

మూడేళ్ల ఆడిటింగ్‌లో పెద్ద మొత్తంలో అక్రమాలు వెలుగు చూసినట్లు ప్రచారం జరుగుతోంది. పనుల బిల్లుల చెల్లింపులో సరైన ఆధారాలు లేక పోవడం, నాసిరకం పనులకు డబ్బులు మంజూరు, రెండేసి మార్లు బిల్లుల చెల్లింపు తదితర విషయాలను ఆడిట్ అధికారులు బట్టబయలు చేయనున్నట్లు సమాచారం. ఆడిట్‌లో ప్రాథమికంగా వచ్చిన రిపోర్టును చూసిన ఓ అధికారి నిర్ఘాంతపోయిన సంగతి పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

సంజాయిషీ ఇవ్వడానికి వచ్చిన అధికారులు

పురపాలికలో ఓ పనికి సంబంధించిన ఎంబీ రికార్డు నాటి ఇంజనీర్, కమిషనర్ నిర్లక్ష్యం మూలంగా మాయమైన సంగతి తెలిసిందే. ఈ విషయం బయటకు రాకుండా అధికారులు నానా తంటాలు పడ్డారు. దీనిపై 'సాక్షి' ప్రచురించిన కథనాలతో గుర్తుతెలియని వ్యక్తి పురపాలిక కార్యాలయంలో మాయమైన ఎంబీ రికార్డును కొరియర్ ద్వారా మున్సిపాలిటీకి పంపించారు. సీడీఎంఏ వరకు వెళ్లగా పోలీస్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని నాటి కమిషనర్ రవీందర్‌యాదవ్, డీఈ రవికిరణ్, ఏఈ శాంతి స్వరూప్, అకౌంటెంట్ శివను కోరగా బుధవారం వారు కలెక్టరేట్‌కు వచ్చారు. పత్రికా విలేకరులను చూసి కనిపించకుండా దాక్కున్నారు. తమ ఆత్మగా పిలుచుకునే సాగర్ అనే అవుట్ సోర్సింగ్ వ్యక్తిని వెంట తెచ్చుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్‌కు రాసిచ్చిన సంజాయిషీలో ఏముందో తెలియాల్సి ఉంది. ఈ విషయమై కమిషనర్ రజితను వివరణ కోరగా మున్సిపాలిటీ నుంచి మాయమైన ఎంబీ రికార్డు.. తిరిగి ఆకాశ రామన్న కొరియర్‌లో ఎలా వచ్చిందనే దానిపై గత కమిషనర్, డీఈ, ఏఈ, అకౌంటెంట్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేయగా కలెక్టరేట్ వద్దకు వచ్చారని చెప్పారు.

రైతు ఉసురు తీసిన అప్పులు


జాటోత్ శ్రీను

పెద్దవంగర : అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. మండలంలోని గంట్లకుంట గ్రామ పరిధిలోని అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోత్ శ్రీను (45) తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశారు. వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పు తీర్చలేని, కుటుంబాన్ని పోషించలేని దుస్థితిలో కొంత కాలంగా శ్రీను కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషయాన్ని పలువురికి చెప్పి బాధపడ్డాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తుండడంతో వారికి చెల్లించే దారి లేక బుధవారం ఉదయం 6 గంటలకు తన వ్యవసాయ భూమిలోని చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కొడుకు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పురుగుల మందు తాగి కౌలు రైతు..

మామునూరు : వడగళ్ల వర్షంతో పంట నష్టపోయి పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేననే మనోవేదనతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ మండల పరిధిలోని బొల్లికుంట గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని రామన్నకుంట తండకు చెందిన మాలోతు బాలు (40) భార్య యాకలక్ష్మి, పిల్లలను తీసుకుని ఐదేళ్ల క్రితం బొల్లికుంట గ్రామానికి వలస వచ్చారు. బొల్లికుంటకు చెందిన దొంతి సత్యనారాయణరెడ్డికి చెందిన నాలుగెకరాల వ్యవసాయ భూమిని మాలోతు యాకలక్ష్మి, బాలు దంపతులు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వరి, మొక్కజొన్న పంట వేయగా కోతకు వచ్చిన పంట ఇటీవల కురిసిన వడగళ్ల వర్షంతో పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో బాలు భారీగా నష్టపోయాడు. అప్పులు తీర్చే పరిస్థితి లేక ఆ దంపతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఉదయమే మాలోతు బాలు భార్య యాకలక్ష్మి ఇద్దరు పిల్లలను తీసుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లగా ఇంట్లో బాలు ఒక్కడే ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల గురై మనోవేదనతో బాలు మంగళవారం అర్ధరాత్రి పంట పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేములవాడ నుంచి గ్రామానికి మంగళవారం రాత్రి చేరుకున్న యాకలక్ష్మి భర్త ఇంట్లో లేకపోవడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. అప్పటికే బాలు స్పృహ తప్పి పడిపోయి ఉండగా ఆటోలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే బాలు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఎస్సై రాజేష్‌రెడ్డి, సీఐ క్రాంతికుమార్ ఘటన స్థలాన్ని, ఎంజీఎంను చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య యాకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ మీడియాకు తెలిపారు.

పేదలకు అండగా ఎస్సీ స్టడీ సర్కిల్

- ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వసతి

హన్మకొండ : ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు చెల్లించి శిక్షణ పొందే ఆర్థిక స్తోమత లేని పేదలకు ఎస్సీ స్టడీ సర్కిల్ అండగా నిలుస్తోంది. పేదలకు ఉద్యోగాలు అందించే విద్యాలయంగా వెలుగొందుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు నిపుణులైన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతోంది. పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ ఉద్యోగం సాధించేలా నిరుద్యోగులను తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే అనేక మందిని ఉద్యోగులుగా తయారు చేసింది. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్టీసీ కాలనీలో ఏర్పాటైన ఎస్సీ స్టడీ సర్కిల్ వరంగల్ ఉమ్మడి జిల్లా నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా నిలిచింది.

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ పేద నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ, భోజన వసతి కల్పిస్తూ వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయిలో 2015–16లో ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించింది. 2016 నుంచి ఏటా


హనుమకొండ ఆర్టీసీ కాలనీలోని ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం

రెండు కోచింగ్ ప్రోగ్రాం (5 నెలల కాలంతో)నిర్వహిస్తోంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు 5 నెలల కోచింగ్ ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ ఉద్యోగాలకు, గ్రూప్–1, 2, 3, 4, బ్యాంకింగ్, పోలీస్, ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు.

కోచింగ్‌కు అర్హత

కోచింగ్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు. ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా 75 ఎస్సీ, 15 బీసీ, 10 ఎస్టీలకు చెందిన వారిని ఎంపిక చేసి ఉచిత భోజన, వసతి కల్పిస్తూ పాఠ్యపుస్తకాలు అందిస్తున్నారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. వివిధ సబ్జెక్టుల్లో వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన మోడల్‌లో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన, విషయ పరిజ్ఞానం కలిగిన ఫ్యాకల్టీ ద్వారా రోజు వారీగా తరగతులు నిర్వహించడంతోపాటు కార్పొరేట్, ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు దీటుగా శిక్షణ ఇస్తున్నారు. పోటీ పరీక్షలకు నమూనా పరీక్షలు నిర్వహిస్తూ పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. ఈ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఇప్పటివరకు 134 ఉద్యోగాలు సాధించారు. వీరిలో 7గురు ఎస్సై, 41 మంది కానిస్టేబుల్, 9 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఇద్దరు వీఆర్‌ఓలు, 48 మంది జూనియర్ పంచాయతీ ఆఫీసర్లు, ఇద్దరు టీజీటీ ప్రిన్సిపాళ్లు, ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలు, ఆరుగురు గ్రూప్–4, 9 మంది ఆర్‌ఆర్‌బీ ఉద్యోగాలు పొందారు. అలాగే ఈ అధ్యయన కేంద్రం ద్వారా 2021 నుంచి 2023 వరకు శిక్షణ పొందిన అభ్యర్థుల్లో 152 మంది ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్, శారీరక ధారుడ్య, మెయిన్ పరీక్షలు రాశారు. గతంలో నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 32 మంది ఉత్తీర్ణులయ్యారు.

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నారు. నేను ఈ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది ఉద్యోగం సాధించాను. ప్రశాంత వాతావరణంలో ఏర్పాటైన స్టడీ సర్కిల్‌లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పోటీ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు.

– కె.మధుబాబు, ఎస్సై, కురవి

వరంలా ఎస్సీ స్టడీ సర్కిల్



ప్రభుత్వ ఉద్యోగాన్వేషణలో ఉన్న నాకు ఎస్సీ స్టడీ సర్కిల్ వరంలా కనిపించింది. తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ ప్రిలిమ్స్ పూర్తి చేసి మెయిన్స్‌కు క్వాలిఫై కావటానికి స్టడీ మెటీరియల్, కోచింగ్ ఉపయోగపడ్డాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ సంస్థల్లో కోచింగ్ తీసుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఈ స్టడీ సెంటర్ వరంలాంటిది.

– రౌతు అజయ్ కుమార్

నేడు ఉద్యోగం పొందడంలో స్టడీ సర్కిల్ పాత్ర కీలకం



నేను ఉద్యోగం పొందడంలో ఎస్సీ స్టడీ సర్కిల్ పాత్ర కీలకంగా నిలిచింది. ఈ విజయంతో జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకునే ధైర్యం, పట్టుదల ఏర్పడ్డాయి. డైరక్టర్ ఎర్రగట్టు స్వామి, అధ్యాపకులు అందించిన గైడ్‌లైన్స్ చాలా ఉపయోగపడ్డాయి.

– పి.ఓదెమ్మ, హెచ్‌డబ్ల్యూఓ గ్రేడ్–2

ఉద్యోగాలతోపాటు సామాజిక చైతన్యం



ఇక్కడ పొందిన శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందడంతోపాటు సామాజిక చైతన్యంతో బయటకి వెళ్తున్నారు. ప్రస్తుత పోటీని తట్టుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అధ్యయన కేంద్రాల ద్వారా ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తోంది. పోటీ వీరి మధ్యే ఉంది. ప్రతిభకు కొదువ లేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటే తప్ప విద్య విజ్ఞానానికి లోటు లేదు. ఇలాంటి వారికి స్టడీ సర్కిళ్లు దోహదపడుతున్నాయి.

– ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, డైరెక్టర్, స్టడీ సర్కిల్

లండన్‌లో వరంగల్ విద్యార్థిని ఆత్మహత్య

- ఈ నెల 10న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- నేడు నగరానికి చేరుకోనున్న మృతదేహం


శ్రావణి(ఫైల్)

ఎంజీఎం: లండన్ బ్లూమ్స్ బెర్రీ ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న నగరానికి చెందిన బసవరాజ్ శ్రావణి(27) ఈ నెల 10న ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. కాగా, ఆమె మృతదేహం గురువారం ఉదయం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందని బంధువులు తెలిపారు. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ ప్రాంతానికి చెందిన బసవరాజ్ విజయ రమేష్ దంపతుల కూతురు శ్రావణి ఉన్నత విద్య నిమిత్తం లండన్ వెళ్లింది. తండ్రి వృత్తిరీత్యా లారీడ్రైవర్, తల్లి గృహిణి. తమ ఉన్నత చదువుల కోసం సొంత ఇంటిని అమ్మిన ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో శ్రావణి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని బంధువులు తెలిపారు. లండన్‌లోని వరంగల్ ఎన్నారై ఫోరం బృందం అధ్యక్షుడు శ్రీధర్ నీల, ఫౌండర్ కిరణ్ పసునూరి, జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ బిట్ల, ఉమెన్ వింగ్ సెక్రెటరీ మేరీఏలు ఇండియా ఎంబసీ అధికారులతో సంప్రదించి మృతదేహాన్ని భారతదేశానికి పంపించినట్లు పేర్కొన్నారు. శ్రావణి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు రూ.30 లక్షల ఆర్థిక సహాయాన్ని కూడా అందజేసినట్లు తెలిసింది.

విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

- రూ.3.18 లక్షల విలువైన వైర్లు, బైక్ స్వాధీనం
- నిందితుల్లో బాలుడు
- భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర


విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తన క్యాంప్ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట బుధవారం ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని దస్రుతండాకు చెందిన బానోత్ చంద్రశేఖర్, బానోతు మధుకుమార్, మొద్దు కిషన్, మరో బాలనేరస్తుడితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రోళ్లగడ్డతండాకు చెందిన గుగులోతు పవన్ కళ్యాణ్ కూలి పనులు చేసుకుంటూనే విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్నారు. వీరికి హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉండే పాత సామగ్రి విక్రయించే పిడిగు నవీన్ చోరీ చేయడానికి ఉపయోగపడే కట్టర్లు, ఇతర సామగ్రి, రవాణా కోసం వాహనాన్ని సమకూర్చుతున్నాడు. నిందితులు అక్కడక్కడా చోరీ చేసిన వైర్లను నవీన్‌కు విక్రయించేవారు. ఈ ముఠా ఇటీవల బీబీనగర్‌లోని ఎంఆర్ఆర్ వెంచర్‌లో విద్యుత్ వైర్లను చోరీ చేసింది. ఈనెల 20న వెంచర్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నిందితులను కొండమడుగు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల నుంచి రూ.3.18 లక్షల విలువైన వైర్ల బండిళ్లు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఓ మైనర్ ఉండగా అతడ్ని జేజే యాక్ట్ మేరకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. దొంగతనానికి పాల్పడేందుకు సహకరించడంతోపాటు చోరీ చేసిన వైర్లను కొనుగోలు చేస్తున్న నవీన్‌ను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. పట్టుబడిన వారు ఇప్పటికే బీబీనగర్, భువనగిరితోపాటు ఆత్మకూర్(ఎం) మండలాల పరిధిలో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. సమావేశంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్సై యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

- చలాన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని బైక్ తీసుకెళ్లిన పోలీసులు
- మనస్తాపంతో పురుగుల మందు తాగిన మొగిలి


మొగిలి (ఫైల్)

హసన్‌పర్తి: ట్రాఫిక్ చలాన్‌లు కట్టలేదని పోలీసులు వాహనాన్ని పట్టుకెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. తన తండ్రి మృతికి ట్రాఫిక్ పోలీసులే కారణమని కుమారుడు సూర్య హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన పాలకుర్తి మొగిలి(54) నగరంలోని ఓ బట్టల షాపులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మల్లారెడ్డిపల్లి నుంచి బైక్‌పై వరంగల్‌కు వెళ్లి విధులు నిర్వహించి తిరిగి రాత్రి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆ బైక్‌పై 9 ట్రాఫిక్ ఉల్లంఘన చలాన్‌లు నమోదయ్యాయి. ఈ నెల 21న ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా చూడగా చలాన్లు పెండింగ్‌లో ఉండడంతో వాటిని కట్టి బైక్ తీసుకెళ్లాలని చెప్పారు. దీంతె అతను మల్లారెడ్డిపల్లికి ఆటోలో వెళ్లాడు. వాహనం లేకపోవడం వల్ల విధులకు వెళ్లలేనని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు వచ్చి రూ.3వేలు ఇచ్చి వెళ్లారని బంధువులు ఆరోపించారు.

మొక్కజొన్న మిషన్ పడి మహిళా కూలీ ..

- అనాథలుగా మారిన పిల్లలు


మృతి చెందిన ఉపేంద్ర

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ గ్రామం వద్ద ట్రాక్టర్ నడుస్తున్న క్రమంలో దానికి వెనకాల ఉన్న మక్కజొన్న మిషన్ అటుఇటు ఊగుతూ కింద పడడంతో మహిళా కూలీ లకావత్ ఉపేంద్ర (35) అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై దామెరుప్పుల దేవేందర్ కథనం ప్రకారం.. రోజువారీ కూలీ పనిలో భాగంగా గూడూరు మండలంలోని చక్రుతండాకు చెందిన ఉపేంద్ర తోటి కూలీలతో కలిసి చింతనెక్కొండ గ్రామానికి మక్కజొన్నలు పట్టేందుకు వచ్చింది. గ్రామంలో ఓ రైతు వద్ద మక్కజొన్న పట్టి మరో రైతు వద్దకు మక్కజొన్న పట్టేందుకు ట్రాక్టర్ ఇంజన్ వెనకాల మొక్కజొన్న పట్టే మిషన్‌పై కుడి వైపు ఇద్దరు, ఎడమ వైపు ఇద్దరు కూర్చొని వెళ్తున్న క్రమంలో మిషన్ అదుపు తప్పడంతో ముగ్గురు కింద దూకగా ఉపేంద్ర మీద మిషన్ పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు

ఉపేంద్ర భర్త నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఉపేంద్ర కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను సాకుతోంది. ఆమె బుధవారం మృతి చెందగా ఆమె కొడుకు, కూతురు అనాథలుగా మారారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు,,


మృతి చెందిన యాకూబ్ పాషా

కేసముద్రం : ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఎండి.యాకూబ్ పాషా (23) ఈనెల 22న కేసముద్రం స్టేషన్‌లో ఉంటున్న తన సోదరుడి వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం అయ్యగారిపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి కేసముద్రం వైపు వస్తుండగా అయ్యగారిపల్లి, మహముద్‌పట్నం గ్రామాల మధ్య బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యాకూబ్ పాషా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజ్‌మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ క్రాస్ రోడ్డు రిజర్వాయర్ కట్ట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో శివరాత్రి మల్లయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని మీదికొండ శివారులోని వడ్డెగూడెంకు చెందిన శివరాత్రి మల్లయ్య తన ద్విచక్ర వాహనంపై స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చి తిరిగి రాత్రి వడ్డెగూడెం వెళ్తుండగా తాటికొండ క్రాస్‌రోడ్డు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. మృతుడికి భార్య పూలమ్మ, ముగ్గురు కూతుళ్లున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా


సన్మాన గ్రహీతలతో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, జర్నలిస్టు నేతలు, తదితరులు

- త్వరలోనే ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తాం
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి అభినందన

నయీంనగర్ : జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. త్వరలోనే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ అభినందన సభలో ఆయన మాట్లాడారు. చాలా కాలంగా జర్నలిస్టులు ఎదురు చూస్తున్న ఇళ్ల స్థలాల సమస్యను తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలోపే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ నగరంలో పని చేస్తున్న జర్నలిస్టుల కోసం తన నియోజకవర్గ పరిధిలో భూమిని గుర్తించామని, త్వరలోనే దానికి కార్యరూపం రానుందని తెలిపారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ టీయుడబ్ల్యూజే (ఐజేయూ)ను జర్నలిస్టుల పక్షపాతిగా అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సాధారణ జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా యూనియన్ పని చేస్తోందన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, అతిథులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమానికి యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షత వహించగా వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, జాతీయ రాష్ట్ర నాయకులు దాసరి కృష్ణారెడ్డి, గాడిపెల్లి మధు, వల్లాల వెంకటరమణ, గుంటి విద్యాసాగర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, సదయ్య, యూనియన్ జిల్లా బాధ్యులు తోట సుధాకర్, రాంచందర్, దుర్గాప్రసాద్, కంకణాల సంతోష్, సంగోజు రవి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని మంత్రి దయాకర్‌రావు అభినందించారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం


దొంత శ్రీనివాస్ (ఫైల్)

రఘునాథపల్లి : ప్రేమ విఫలమై రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గోవర్ధనగిరి రైల్వే గేట్ సమీపంలోని ట్రాక్‌పై బుధవారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బాంజీపేట గ్రామానికి చెందిన దొంత సత్యనారాయణ–సావిత్రి దంపతుల కొడుకు శ్రీనివాస్ (25) రఘునాథపల్లిలో బైకు మెకానిక్ షాపు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్ కొంతకాలంగా ఓ యువతితో ప్రేమాయణం సాగిస్తున్నట్లు తెలిసింది. ఆ అమ్మాయితో ప్రేమ విఫలం కావడంతో మానసికంగా బాదపడుతుండే వాడని సమాచారం. కాగా జీవితంపై విరక్తి చెంది శ్రీనివాస్ గోవర్ధనగిరి రైల్వే గేట్ సమీపంలోని ట్రాక్‌పై గుర్తు తెలియని రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ పరంగా ఇబ్బంది లేదని, మంచి మెకానిక్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడని, ప్రేమ విఫలం కావడంతోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కాజీపేట జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి పరశురాములు తెలిపారు.

అత్తతో గొడవ పడి కోడలు..


తేజావత్ పావని

గూడూరు : అత్తతో గొడవపడిన ఓ కోడలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పడమటి తండాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన భూక్య వీరేందర్ కూతురు పావనిని 2019లో పడమటి తండాకు చెందిన తేజావత్ సుమన్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. దంపతులకు ఇద్దరు పిల్లలు కలిగారు. వారం రోజుల క్రితం పావనితో ఆమె అత్త గొడవ పడింది. తరచూ అత్తతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల క్రితం గొడవ జరగ్గా ఆవేశానికి గురైన పావని ఉన్న ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పావని బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం


ఆర్టీసీ రాజధాని బస్సు


రోడ్డు ప్రమాదానికి గురైన కారు

- కారును ఢీకొట్టిన ఆర్టీసీ 'రాజధాని' బస్సు
- మరొకరి పరిస్థితి విషమం

స్టేషన్‌ఘన్‌పూర్ : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని మీదికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా కారులో ప్రయాణిస్తున్న నేహారామ్(25), వసుంధర దేవి(47) మృతి చెందగా దేవరపల్లి జీవన్‌బాబు తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలిలా.. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన దేవరపల్లి జీవన్ బాబు, అతని భార్య వసుంధర దేవి, కూతురు నేహారామ్ హైదరాబాద్ నుంచి మీదికొండకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్లే క్రమంలో మండలంలోని మీదికొండ క్రాస్ రోడ్డు సమీపంలోని దాబా హోటల్‌కు వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు మీదికొండ క్రాస్ వద్ద రోడ్డు క్రాస్ చేసేందుకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి హన్మకొండకు వస్తున్న ఆర్టీసీ రాజధాని బస్సు కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నేహారామ్ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాల పాలైన వసుంధర దేవి, జీవన్ బాబులను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా వసుంధర దేవి మార్గమధ్యలో మృతి చెందింది. జీవన్ బాబు వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.


ఘటనా స్థలిలో నేహారామ్ మృతదేహం


మార్గమధ్యలో మృతి చెందిన వసుంధర దేవి


గాయపడ్డ జీవన్‌బాబు